సాక్షి
వనపర్తి
మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



.. రైతులకు వరం

ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన రైతులకు వరమని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ అన్నారు.

-10లో ▸



ఉద్యోగుల్లో కలవరం?

కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

-10లో ▸

గరిష్టం/కనిష్టం
33.8/21.9

వాతావరణం

మధ్యాహ్నం ఎండ తీవ్రత కాస్త కనిపిస్తుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

బాల్యానికి ‘బంధనం’

జిల్లాలో ఈ ఏడాది 30 బాల్య వివాహాలకు అడ్డుకట్ట



బాల్య వివాహాల నిర్మూలన వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఇతర జిల్లా అధికారులు

- సకాలంలో స్పందించిన అధికారులు
- వివాహమైన తర్వాత తెలుసుకొని ఒకరిపై కేసునమోదు
- వందరోజుల అవగాహన కార్యక్రమానికి అధికారులు సన్నద్ధం
- గ్రామ, మండలస్థాయిలో కమిటీల ఏర్పాటుకు కసరత్తు

జిల్లాలో అడ్డుకున్న బాల్య వివాహాలు (ఏడాది వారీగా..)

2023	2024	2025 (ఇప్పటి వరకు)
37	52	30

వనపర్తి: బాలికల ఉజ్వల భవిష్యత్‌కు బాల్య వివాహాలు బంధనంగా మారుతున్నాయి. అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, బాధ్యులకు గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా వంటి చర్యలుంటాయని తెలిసినా.. కొందరు తల్లిదండ్రులు విఫల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారుల లెక్కల ప్రకారం.. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 30 బాల్య వివాహాలను అడ్డుకున్నారు. ఒక బాల్య వివాహం జరిగిన విషయం ఆలస్యంగా తెలియడంతో కేసు నమోదు చేసి సదరు బాలికకు ప్రభుత్వ సంరక్షణలో విద్యాబుద్ధులు చెప్పిస్తున్నారు. ప్రపంచ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని జస్ట్ రైట్ సంస్థ కొన్ని స్వచ్ఛంద సంస్థలను ఎంచుకొని అక్టోబర్ 11 నుంచి 2026, జనవరి 26 వరకు వందరోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ఆర్డీఎస్ సంస్థ నిర్వహిస్తుండగా.. బాలికలు తమ హక్కులను వినియోగించుకోవడంలో వెనుకబడిన ప్రాంతాలను ఎంపిక చేసుకొని బాల్యవివాహాల నిర్మూలన, బడిబయటి పిల్లలను పాఠశాలలో చేర్పించనున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ‘ఇచ్చట బాల్య వివాహాలు నిర్వహించబడవు’ అని రాసి ఉన్న వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆదర్శ్ సురభితో ఆవిష్కరింపజేసి వీటిని ప్రతి గ్రామంలోని ఆలయాలు, చర్చీలు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయనున్నారు.

17వ తేదీలోగా కమిటీల ఏర్పాటు..

విద్యాపరంగా ఎంతో చైతన్యమని చెప్పుకొనే జిల్లాలోనూ పదినెలల్లో 31 బాల్య వివాహాలు చేసేందుకు ప్రయత్నించడంపై స్పందించిన కలెక్టర్ బాల్య వివాహాల నిర్మూలనకు గ్రామ, మండల, జిల్లాస్థాయి కమిటీలను ఈ నెల 17లోగా ఏర్పాటు చేయాలని, అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని డీఆర్డీఓ, డీపీఓను ఆదేశించారు. చివరిరోజు జిల్లాస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

ప్రోత్సహిస్తే కేసులు..

బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా తల్లిదండ్రులతో పాటు పెళ్లికి వచ్చిన వారందరిపై కేసులు నమోదు చేస్తాం. అతిత్వరలో గ్రామ, మండలస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తాం. ఆయా కమిటీలు నిత్యం పర్యవేక్షణ చేసి జిల్లా కమిటీకి ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 31 బాల్య వివాహాలు చేసేందుకు తల్లిదండ్రులు సిద్ధం కావడం శోచనీయం. అధికార యంత్రాంగం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి.

– ఆదర్శ్ సురభి, కలెక్టర్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం..

అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలనే నిబంధనను భారత ప్రభుత్వం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. చిన్న వయస్సులో గర్భం దాల్చడంతో అనారోగ్య సమస్యలు, శిశు మరణాలు, గర్భస్రావం, రక్తపోటు, పోషకాహార లోపం, రక్తహీనత తదితర ఇబ్బందులు ఎదురవుతాయి. కానీ కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రేమ వివాహాల వైపు ఎక్కడ ఆకర్శితులవుతారోనని, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోలేక చిన్న వయసులో, చదువుకునే సమయంలో వివాహాలు చేసి బరువు దించుకోవాలనే ఆలోచనతో బాల్య వివాహాలకు పూనుకుంటున్నట్లు తెలుస్తోంది.

నెలాఖరు నాటికి కేంద్రాల ఏర్పాటు

రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్



సమావేశంలో పాల్గొన్న రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, జిల్లా అధికారులు

వనపర్తి: జిల్లాలో 2025–26 వానాకాలం వరి ధాన్యం **కొనుగోలుకుగాను నెలాఖరు నాటికి** కేంద్రాలు **ఏర్పాటు చేయనున్నట్లు రెవెన్యూ అదనపు** కలెక్టర్ **ఖీమ్యానాయక్ తెలిపారు. సోమవారం** ధాన్యం **కొనుగోళ్ల సన్నద్ధతపై హైదరాబాద్ నుంచి** రాష్ట్ర **పౌరసరఫరాలశాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర** అన్ని జిల్లాల రెవెన్యూ అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా నుంచి అదనపు కలెక్టర్‌తో పాటు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి కాశీ విశ్వనాథం, పౌరసరఫరాలసంస్థ డీఎం జగన్మోహన్, డీఆర్డీఓ పీడీ ఉమాదేవి పాల్గొని వివరాలు వెల్లడించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నెలాఖరు నాటికి పంటలు కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని.. ఆలోగా కేంద్రాలు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాల్లో కావాల్సిన సామగ్రితో పాటు గన్నీ బ్యాగులు, ధాన్యం శుభ్రం చేసే, బరువు, తేమ కొలిచే యంత్రాలతో పాటు డిజిటల్ కాలిపర్స్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ధాన్యం తడవకుండా కావాల్సినన్ని టార్పాలిన్లు సమకూర్చుకోవాలని, సన్న, దొడ్డు రకం ధాన్యం సేకరణకు వేర్వేరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లు చేయాలని కోరారు. కేంద్రాల నిర్వాహకులకు శిక్షణనిచ్చేందుకు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీసీఓ రాణి, డీటీఓ మానస, డీఏఓ ఆంజనేయులుగౌడ్, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాణాసంచా విక్రయానికి అనుమతి తప్పనిసరి



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: దీపావళి సందర్భంగా బాణాసంచా విక్రయించే వారు సంబంధిత పోలీస్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పండుగను జిల్లా ప్రజలు ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని కోరారు. అక్రమంగా బాణాసంచా నిల్వచేసినా, తయారుచేసినా, దుకాణాలు నెలకొల్పినా, భద్రతా ప్రమాణాలు పాటించకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్, ఫైర్ విభాగం, పోలీసుశాఖ సూచించిన ప్రదేశాల్లో మాత్రమే లైసెన్స్ ఉన్న వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసి తగిన జాగ్రత్తలు పాటిస్తూ విక్రయించాలన్నారు. రద్దీ ప్రదేశాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, పెట్రోల్ బంకులు, వివాదాస్పద స్థలాల్లో ఏర్పాటు చేయొద్దని కోరారు. నిర్దేశిత రుసుం చెల్లించి విద్యుత్, అగ్నిమాపక, పుర అధికారుల అనుమతి కూడా తీసుకోవాలన్నారు.

ఎస్పీ ప్రజావాణికి 10 వినతులు

ప్రజావాణి ఫిర్యాదులపై పోలీసు అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించాలని ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయములో జరిగిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో వినతులు స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సదరు ఫిర్యాదులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులకు సూచించారు. మధ్యాహ్నం భోజన విరామ సమయం వరకు మొత్తం 10 వినతులు వచ్చినట్లు ఎస్పీ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

న్యూస్‌రీల్

వంతెన నిర్మాణం పూర్తి చేస్తాం : ఎమ్మెల్యే



మదనపురం: మండలంలోని ఊకచెట్టు వాగుపై వంతెన నిర్మాణాన్ని నెల రోజుల్లో పూర్తి చేస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నమూనా ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన అనంతరం ఊకచెట్టు వాగులో నిర్మించిన వంతెన అప్రోచ్‌రోడ్ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం అనేక పథకాలు అమలుచేస్తూ పేదలను ఆదుకుంటుందని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని.. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించకుండా మోసం చేసిందని మండిపడ్డారు. వంతెన నిర్మాణాన్ని కూడా పట్టించుకోలేదని.. ప్రస్తుత ప్రభుత్వం మిగిలిన పనుల పూర్తికి రూ.6 కోట్లు మంజూరు చేసిందని వివరించారు. వంతెన నిర్మాణం పూర్తయితే అమరచింత, ఆత్మకూర్, చిన్నచింతకుంట, మదనాపురం, కొత్తకోట మండల ప్రజల రాకపోకలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్, వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నాగన్న, మహేష్ పాల్గొన్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ..

ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటు చోరీ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు.

నారాయణస్వామికి స్వాగతం పలికిన నాయకులు

వనపర్తి: డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక నేపథ్యంలో మంగళవారం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యేందుకు ఏఐసీసీ పరిశీలకుడు, పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి సోమవారం రాత్రి జిల్లాకేంద్రానికి చేరుకున్నారు. ఆయనకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి, నాయకులు చీర్ల చందర్, శంకరప్రసాద్, వెంకటేష్, కృష్ణబాబు, యాదయ్య, పాకనాటి కృష్ణ, కోట్ల రవి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మంగళవారం ఉదయం విలేకరుల సమావేశం, మధ్యాహ్నం తర్వాత ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని అభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు.

బాలల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

వనపర్తి: బాలల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి పౌష్టికాహార లోపంతో ఎత్తుకు తగిన బరువు లేని పిల్లలను గుర్తించి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. పోషణ మాసంలో భాగంగా సోమవారం జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రాసన, అక్షరాభ్యాసం, సీమంతం కార్యక్రమాలకు అధికారులతో కలిసి పాల్గొని చిన్నారులకు ఆహారం తినిపించడంతో పాటు గర్భిణులను ఆశీర్వదించారు. జిల్లాలో ఎత్తుకు తగ్గ బరువు, వయసుకు తగ్గ ఎత్తు లేని పిల్లలు 498 మంది ఉన్నట్లు గుర్తించామని.. వారికి ఎన్ఆర్సీ కేంద్రాల్లో వైద్యం, పౌష్టికాహారం అందిస్తున్నామని డీడబ్ల్యూఓ సుధారాణి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థినులను గుర్తించి విద్యాలయాలకు పంపించేలా చూడాలన్నారు. త్వరలో నిర్వహించే తల్లిపాల అవగాహన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలతో పాటు వారి భర్తలు సైతం హాజరయ్యేలా ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, డీఆర్డీఓ ఉమాదేవి పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులు పరిష్కరించాలి..

ప్రజావాణి ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, డిప్యూటీ కలెక్టర్ రంజిత్‌తో కలిసి పాల్గొని అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా ప్రజావాణితో పాటు సీఎం ప్రజావాణి నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ తగిన సమాచారం ఫిర్యాదుదారులకు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మధ్యాహ్నం భోజన విరామ సమయం వరకు 34 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.


కలెక్టర్ ఆదర్శ్ సురభి

భవిష్యత్‌కు భరోసా



పీయూలోని స్టడీ సెంటర్‌లో చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

- పీయూలో చదువుకున్న పలువురు విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు
- స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది.. వివిధ స్థాయిల్లో కొలువులు
- ప్రైవేట్‌తోపాటు దేశ, విదేశాల్లోనూ పూర్వ విద్యార్థుల రాణింపు



మరో 3 రోజులు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్నత విద్యకు కేంద్ర బిందువుగా మారిన పీయూ ఎంతోమంది పేద విద్యార్థుల జీవితాలను నిలబెట్టేందుకు వరప్రదాయినిగా మారింది. ఇంటర్ తర్వాత చేరే ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ మొదలుకొని.. డిగ్రీ తర్వాత పీజీ స్థాయి కోర్సులు చదివిన ఎంతో మంది విద్యార్థులు వివిధ స్థాయిల్లో ఉద్యోగాల్లో చేరి జీవితంలో ఉన్నతంగా రాణిస్తున్నారు. యూనివర్సిటీలో పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని వసతులు కల్పించడంతో విద్యార్థులు జీవితంలో స్థిరపడి ఇక్కడి నుంచి వెళ్తున్నారు. సాధారణంగా యూనివర్సిటీలో స్టడీ సర్కిల్ ద్వారా తరగతులు బోధించేందుకు అటు ప్రభుత్వం, ఇటు విద్యార్థి నుంచి ఎలాంటి డబ్బులు తీసుకోకుండా కేవలం యూనివర్సిటీ అధికారులు ప్రత్యేకంగా నిధులు కేటాయించి శిక్షణ ఇప్పిస్తున్నారు. దీంతో మంచి ఫలితాలు వస్తున్నాయి.

పోటీ పరీక్షలకు సన్నద్ధం..

యూనివర్సిటీలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేక లైబ్రరీ, అవసరమైన పుస్తకాలు ఎప్పటికప్పుడు అధికారులు అందుబాటులో ఉంచుతున్నారు. వీటితో పాటు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు అధికారులు ప్రత్యేక స్టడీ సర్కిల్ సైతం నిర్వహించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కళాశాల తరగతులు లేని సమయంలో స్టడీ సర్కిల్ కొనసాగించారు. దీంతో గతేడాది వెలువడిన పలు పోటీ పరీక్షల ఫలితాల్లో చాలామంది పీయూ విద్యార్థులు ఉత్తీర్ణత పొంది ఉద్యోగాలు సాధించారు. 2018– 19 విద్యా సంవత్సరంలో 160 మంది స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ పొందితే 35 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. 2019– 20లో 143 మంది శిక్షణ పొందగా... 21 మంది ఉద్యోగాలు పొందారు. 2020–21లో కోవిడ్ కారణంగా శిక్షణ జరగలేదు. ఇక 2021– 22లో 135 మంది శిక్షణ తీసుకుంటే 25 మంది, 2022– 23లో 197 మంది శిక్షణ తీసుకుంటే 107 మంది విద్యార్థులు కానిస్టేబుల్, డీఎస్సీ, గ్రూప్–4 వంటి ఉద్యోగాలు సాధించడం గమనార్హం. అలాగే పలు ప్రైవేట్ సంస్థలు, విదేశాల్లోనూ కొందరు ఉద్యోగాలు పొందారు.

అధికారుల సహకారంతో..



పీయూలో వివిధ సబ్జెక్టుల్లో పీజీ వరకు చదివిన అనేక మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడ్డారు. అందు కోసం స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా శిక్షణ తరగతులు నిర్వహించాం. అందుకోసం యూనివర్సిటీ అధికారులు సైతం ఎంతో సహకరించారు.

– భూమయ్య, స్టడీ సర్కిల్ డైరెక్టర్, పీయూ

సదుపాయాలు బాగున్నాయి..



పీయూలో 2013– 15 బ్యాచ్‌లో నేను ఎంఎస్‌డబ్ల్యూ చదివాను. ఈ క్రమంలో అప్పటికే లైబ్రరీలు, స్టడీ హాల్ వంటి సదుపాయాలు బాగానే ఉన్నాయి. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో అక్కడి అధ్యాపకులు, అధికారులు ఎంతో ప్రోత్సహించడంతో పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకున్నాం. దీంతో పీజీ పూర్తి అయిన వెంటనే ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడ్డాను.

– మల్లేష్, జూనియర్ లెక్చరర్, వనపర్తి కళాశాల

యువతకు జీవితం..



నేను పీయూలో చదువుకునే క్రమంలో గ్రూప్–2కు సిద్ధమయ్యాను. అప్పుడు అక్కడ ఉండే వసతులు చాలా వినియోగించుకున్నాం. అప్పటి రిజిస్ట్రార్ వెంకటాచలం, అధ్యాపకులు గాలెన్న ఎంతో సహకరించారు. మాతో పాటు చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు సైతం ఉద్యోగాలు సాధించారు. పీయూ 4వ స్నాతకోత్సవం జరపుకోవడం చాలా గొప్ప విషయం. చాలా మంది యువతకు జీవితాన్ని ఇచ్చింది.

– పరమేశ్వర్‌గౌడ్, ఎక్సైజ్ సీఐ, పటాన్‌చెరు

“ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్, సర్పంచ్ పోస్టుల్లో నిలబడాలని అనుకుంటున్న కాంగ్రెస్ నాయకులు.. వివిధ హోదాల్లో ఉన్న కొందరు నేతలు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ప్రయత్నిస్తున్నారు. తాము ఇంట్లో కూర్చుని ఉన్నా.. బీఫాంలు వస్తాయని పగటి కలలు కంటున్నారు. మేం చెబితే బీఫాంలు వస్తాయని ఎవరైతే చెబుతున్నారో.. వారి ఆటలు సాగనివ్వం. డీసీసీ అధ్యక్షుడిగా నేనే బీఫాంలు ఇచ్చేదని గ్రహించాలి.”

– జి.మధుసూదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే (ఓట్ చోరీ కార్యక్రమంలో)

“ఇప్పటివరకు ఫ్యాక్షన్ రాజకీయాలు లేవు. సర్పంచ్ పదవి కోసం సొంత తమ్ముడినే హత్య చేశారు. రేపు ఎమ్మెల్యే పదవి కోసం నన్నూ చంపొచ్చు. ఎన్నికల్లో మమ్మల్ని ఓడించేందుకు ప్రయత్నాలు చేసిన వారిని పార్టీలోకి తీసుకోవడాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలెవరూ ఒప్పుకోరు.

– అనిరుధ్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే (విలేకరుల సమావేశంలో)

.. మహబూబ్‌నగర్ జిల్లాలో అధికార పార్టీ కాంగ్రెస్‌లో మాటలు మంటలు రేపుతున్నాయనే దానికి ఇవి మచ్చుకు ఉదాహరణలు మాత్రమే. బీసీల్లో బలమైన సామాజిక వర్గ నాయకుడు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ఇటీవల తెరపైకి రావడం.. డీసీసీ అధ్యక్ష పదవికి ఏఐసీసీ పరిశీలకులు కసరత్తు చేపట్టిన క్రమంలో ఆయా నియోజకవర్గాల్లో లుకలుకలు వెలుగు చూస్తున్నాయి. కీలకనేతల మధ్య అంతర్గత విభేదాలతో పోరు తారాస్థాయికి చేరినట్లు తెలుస్తోంది. జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో సైతం ‘హస్తం’ నేతల మధ్య అంతర్యుద్ధం కొనసాగుతుండగా.. పార్టీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

‘అధికార’ వార్..!

కాంగ్రెస్‌లో అంతర్గత పోరు

- ఇటు ‘ఢీ’ సీసీ.. అటు ‘చేరిక’ పంచాయితీ
- మాటల తూటాలను పేలుస్తున్న నేతలు
- మహబూబ్‌నగర్‌లో తారాస్థాయికి విభేదాలు ?
- గద్వాల, వనపర్తి జిల్లాల్లోనూ కుతకుత



అన్నీ మహబూబ్‌నగర్ వాళ్లకేనంటూ..

మహబూబ్‌నగర్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల కీలక నేతల మధ్య తొలి నుంచీ అంతర్గత విభేదాలు నెలకొన్నాయి. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా గ్రంథాలయ చైర్మన్, ముడా చైర్మన్ పదవులు మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి దక్కాయి. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ పదవి సైతం ఈ సెగ్మెంట్‌కు చెందిన ఒబేదుల్లా కొత్వాల్‌కు కేటాయించారు. ఈ క్రమంలో అన్ని పదవులు మహబూబ్‌నగర్ నియోజకవర్గ నేతలే తన్నుకుపోతున్నారనే అభిప్రాయం జడ్చర్ల నాయకుల్లో ఉంది. దేవరకద్రకు చెందిన సీతాదయాకర్‌రెడ్డి తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్‌గా నియామకమైనప్పటికీ.. మహబూబ్‌నగర్‌కే పెద్దపీట వేస్తున్నారనే అభిప్రాయం ఈ సెగ్మెంట్ నేతల్లోనూ వ్యక్తమవుతోంది.

మా సెగ్మెంట్‌లోనూ పెత్తనం చెలాయిస్తున్నారని..

డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి జిల్లాకేంద్రంలో పార్టీ కార్యక్రమాలు నిర్వహించడాన్ని ఇక్కడి నాయకులు జీర్ణించుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది. తమ నియోజకవర్గంలోనూ ఆయన పెత్తనం సాగుతోందని స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అనుచరుల్లో నెలకొంది. దీనిపై యెన్నం ఎక్కడా స్పందించకున్నా.. డీసీసీ అధ్యక్షుడు జీఎమ్మార్ ఆధ్వర్యంలో జరిగిన పలు కార్యక్రమాలకు హాజరుకాకపోవడం, అంటీముట్టనట్లుగా వ్యవహరించడంపై పార్టీలో చర్చ జోరుగా సాగుతోంది.

గద్వాల, వనపర్తిలోనూ లుకలుకలు..

వనపర్తి జిల్లాలో ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రాజేంద్రప్రసాద్ మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అనుచరుడు లక్కాకుల సతీష్, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వర్గానికి చెందిన కిరణ్‌కుమార్ పోటీలో ఉన్నారు. వీరితో పాటు శాట్ చైర్మన్ శివసేనారెడ్డి సైతం డీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆయా నేతల వర్గాల మధ్య వైరం మరింత ముదిరినట్లు తెలుస్తోంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ అధ్యక్షురాలు సరిత మధ్య విభేదాలు తారాస్థాయికి చేరగా.. ఆయా వర్గాలకు చెందిన నేతలు డీసీసీ పదవికి పోటీ పడుతున్నారు. ఇక్కడ ఏఐసీసీ నాయకుడు సంపత్‌కుమార్ మద్దతు కీలకం కాగా.. చివరి వరకు ఏం జరుగుతుందనే ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా.. మహబూబ్‌నగర్ జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు తమ మధ్య ఎలాంటి అంతర్గత విభేదాలు లేవని.. పార్టీ విధానాల ప్రకారం సమష్టి నిర్ణయాలతోనే ముందుకు సాగుతున్నామని చెబుతున్నారు. కానీ వారివారి ముఖ్య అనుచరులతో పాటు పార్టీ శ్రేణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

డీసీసీ అధ్యక్ష పదవికి చేపట్టిన కసరత్తులో అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న మధుసూదన్‌రెడ్డి స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఈసారి సైతం తనకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ఈ క్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మన్నె జీవన్ రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. బీసీల నుంచి సంజీవ్ ముదిరాజ్, ఎన్పీ వెంకటేష్.. ఎస్సీ సామాజిక వర్గం నుంచి వినోద్‌కుమార్, మైనార్టీల నుంచి సిరాజ్‌ఖాద్రీ, జహీర్ అక్తర్ పోటీపడుతున్నారు. అయితే డీసీసీ పదవిని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో ఏదైనా సామాజిక వర్గానికి చెందిన సమర్థవంతమైన నాయకుడితో భర్తీ చేస్తే బాగుంటుందని అనిరుధ్‌రెడ్డి కోరడం చర్చనీయాంశమైంది. ఒకవేళ రెడ్డి వర్గానికి కేటాయించిన పక్షంలో తన సోదరుడు దుష్యంత్‌రెడ్డి కూడా పోటీలో ఉంటారని ఆయన చెప్పకనే చెప్పినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. డీసీసీ పదవికి దుష్యంత్‌రెడ్డి దరఖాస్తు చేసుకోలేదని ఆయన చెబుతున్నా.. కాంగ్రెస్ శ్రేణుల్లో మాత్రం భిన్నవాదనలు విన్పిస్తున్నాయి. దీంతో పాటు బీసీల్లో బలమైన సామాజిక వర్గ నాయకుడు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెరపైకి వచ్చిన క్రమంలో అనిరుధ్‌రెడ్డి సోమవారం జడ్చర్లలో చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. అలాగే ఇటీవల డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన ఓట్ చోరీ సంతకాల సేకరణలో పార్టీ కార్యక్రమాలకు హాజరుకాని వారికి ఇదో హెచ్చరిక అంటూ బీఫాంలపై చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.

‘మాటల’ మంటలు..

క్లుప్తంగా

కారు ఢీకొట్టడంతో వ్యక్తి దుర్మరణం

మానవపాడు: జాతీయ రహదారి-44పై ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద కర్నూలు వెళ్లేందుకు రోడ్డుపై నిల్చొని ఉన్న వ్యక్తి కారు ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాలు.. మహబూబ్‌నగర్ జిల్లా ధర్మవరానికి చెందిన కృష్ణయ్యగౌడ్(50) సోమవారం తెల్లవారుజామున 1 గంట సమయంలో ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద సొంత కారు పంక్చర్ అవ్వగా లిఫ్ట్ కోసం రోడ్డుపై నిల్చున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. చెక్‌పోస్టు సిబ్బంది చికిత్స నిమిత్తం కృష్ణయ్యగౌడ్‌ను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

భూత్పూర్: మండలంలోని మద్దిగట్ల గ్రామానికి చెందిన రాజు(35) సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతుడి తండ్రి బాలకిష్టయ్య తెలిపారు. పూర్తి వివరాలు.. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురానికి చెందిన రాజు ఆదివారం కూలీ పని నిమిత్తం వెళ్తున్నాని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. మధ్యాహ్నం పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చా రు. 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో అదేరోజు రాత్రి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనంతరం భూత్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మృతుడి తండ్రి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చెట్టు పైనుంచి జారిపడి యువకుడి మృతి

జడ్చర్ల: సీతాఫలాలను తెంపేందుకు చెట్టుపైకి ఎక్కిన యువకుడు ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన ఘటన బాలానగర్ మండలం పెద్దరేవల్లి శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన రామురాం కాష్యప్(22) బోర్‌వెల్ పనులకు వెళ్తుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం పెద్దరేవల్లి సమీపంలో సీతాఫలాలు తెంపేందుకు చెట్టు ఎక్కాడు. పండ్లు తెంపుతూ జారి దాదాపు 15 అడుగుల లోతు గుంతలో పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.సోమవారం మృతుడి బావ దుర్గారాం మార్కమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


ధన్‌కోటి (ఫైల్)

చారకొండ: ఇంటి మిద్దె పైనుంచి జారి కిందపడిన ఘటనలో చికిత్స పొందుతూ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని సారంబండతండాకు చెందిన ఇస్లావత్ ధన్‌కోటి(44) పదిరోజుల కిందట తన ఇంటి మీద నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తలకు తీవ్రగాయలయ్యాయి. చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య బుజ్జి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతిపై కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మహిళ మృతదేహం లభ్యం



పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్ట సమీపంలో వ్యవసాయ పొలాల వద్ద చాకలి రాముడు గట్టు వద్ద మహిళ శవం ఉందని బర్రెల కాపరి గమనించి స్థానికులకు తెలియజేశాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వవగా.. ఎస్‌ఐ రామన్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మృతదేహం మహిళదని.. మహిళ వయసు 30నుంచి 40 ఏళ్లమధ్యలో ఉండవచ్చని తెలియజేశారు. మహిళను పెట్రోల్ పోసి కాల్చినట్లు తెలియజేశాడు. శవాన్ని పోస్ట్‌మార్టం చేసి పూర్తి వివరాలు సేకరిస్తామని, దుండగులను కచ్చితంగా పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళ అదృశ్యంపై సోమవారం కేసు నమోదైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన స్వాతి భర్తతో గొడవ పడి ఈ నెల 7న ఇంటి నుంచి వెళ్లి పోయింది. ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొత్త్రలో వృద్ధుడు..

వెల్దండ: కొట్రకు చెందిన వృద్ధుడు పోనుగంటి అర్జున్‌రావు(65) అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. ఎస్‌ఐ కురుమూర్తి తెలిపిన వివరాలు.. అర్జున్‌రావు ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి ఎంతకి రాకపోవడంతో అర్జున్‌రావు సోదరుడు కృష్ణారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'ధన్‌ధాన్య'తో రైతులకు వరం


బీజేపీలో చేరిన వారితో ఎంపీ డీకే అరుణ

- గద్వాల, పేట, నాగర్‌కర్నూల్ జిల్లాలు పథకానికి ఎంపిక
- మొదటి విడతగా రూ.960 కోట్లతో అభివృద్ధి పనులు
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

గద్వాల: ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన పథకం రైతులకు వరమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. సోమవారం ఆమె జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన పథకం కింద దేశవ్యాప్తంగా వెనకబడిన ప్రాంతాలైన 100 జిల్లాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. మన రాష్ట్రంలో నాలుగు జిల్లాలు ఎంపిక కాగా పాలమూరు ఉమ్మడి జిల్లాలో జోగుళాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈపథకం కింద మూడు జిల్లాలకు మొదటి విడత కింద రూ.960 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా సాగునీటి వనరులు లేని ప్రాంతాల్లో సాగునీటి వనరులను కల్పించి వివిధ రకాల పంట ఉత్పత్తులు సాగుచేసేలా అభివృద్ధి చేస్తారన్నారు. అదేవిధంగా రైతులు పండించిన పంటలకు అవసరమైన మార్కెటింగ్ సౌకర్యం, మద్దతు ధర కల్పించడం, ఎలాంటి పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయి, సాగుపంటల మార్పిడి వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులను నిల్వచేసుకునేలా పెద్ద ఎత్తున గోదాములను నిర్మిస్తామని, రైతుల ఉత్పత్తి సంఘాల ద్వారా రైతులకు సబ్సిడీపై రుణాలు అందిస్తామన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి

వ్యవసాయ అనుబంధరంగాలైన డైరీ, గొర్రెలపెంపకం, చేపల ఉత్పత్తి వంటివాటిని అభివృద్ధి చేస్తారని ఆమె వివరించారు. ఈప్రాంతప్రజల తరపున దేశప్రధాని మోడీ, వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సిగ్‌చౌహాన్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. 2047నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశాలకు ధీటుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా దేశప్రధాని మోడీ ఒకవిజన్‌తో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గడచిన పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన, ప్రస్తుతం కాంగ్రెస్ పాలన వల్ల ప్రజలకు ఎలాంటి మేలు చేకూరడం లేదన్నారు. ఈరెండు ప్రభుత్వాలు పాలనపరంగా పూర్తిగా వైఫల్యం చెందినట్లు విమర్శలు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు డీకే స్నిగ్ధారెడ్డి, రామాంజనేయులు, రాంచంద్రారెడ్డి, బండల వెంకట్రాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, రమాదేవి, బలిగెర శివారెడ్డి, దేవదాసు, రజకజయశ్రీ, విజయలక్ష్మీ, సమత తదితరులు పాల్గొన్నారు. అనంతరం గద్వాల జిల్లా మహిళా యువమోర్చా అధ్యక్షురాలిగా సమత, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడుగా దేవదాస్‌లను నియమిస్తూ వారికి నియామక పత్రాలు అందజేశారు. ఇదిలాఉండగా, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన సుమారు 250మంది నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరగా.. ఎంపీ కండువాలు కప్పారు. అలాగే, డి లిమిటేషన్ ప్రక్రియలో అయిజను అసెంబ్లీ, గద్వాలను పార్లమెంట్ నియోయోజకవర్గంగా ఏర్పాటు చేయాలని కోరుతూ వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, కులసంఘాలకు చెందిన అఖిలపక్ష కమిటీ నేతలు ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేశారు.

క్షుద్రపూజలతో ఉలిక్కిపడ్డ మాద్వార్


మాద్వార్‌లో నడిరోడ్డుపై క్షుద్రపూజలు చేసిన దృశ్యం


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

- నడిరోడ్డుపై మేకను బలిచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు
- స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

మక్తల్: నిత్యం రద్దీగా ఉండే మాద్వార్ రోడ్డులో అర్ధరాత్రి క్షుద్రపూజలు చేయడం కలకలం రేపాయి. మక్తల్ మండలం మాద్వార్ గ్రామంలో ఆదివారం రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మూడు దారులు కలిసిన చోట నడిరోడ్డుపై మేకను బలిచ్చారు. అంతేగాక, గుమ్మడికాయను పగలగొట్టి కుంకుమ, పసుసు, నిమ్మకాయలు వేశారు. దీంతో మాద్వార్ గ్రామస్తులతోపాటు అటుగా వెళ్లే ఇతర గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మాద్వార్ గ్రామానికి మూడు బాటలు ఉండగా.. లింగంపల్లి నుంచి వచ్చే మార్గంలో గుమ్మడికాయ, పసుపు, కుంకుమల, సంగంబండ వెళ్లే మార్గంలో నిమ్మకాయలు, వివిధ సామగ్రితో గుర్తుతెలియని వ్యక్తులు పూజలు చేశారు. పూజలు చేసిన చోట కత్తి, ఇతర వస్తువులు అలాగే వదిలి వెళ్లారు. ఇదిలాఉండగా, సోమవారం ఉదయం అటుగా వెళ్లే గ్రామస్తులు ఈ దృశ్యాలను చూసి భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకున్నారు. క్షుద్రపూజలు చేసిన చోట పోలీసుల సమక్షంలో గడ్డితో గ్రామస్తులు కాల్చారు. బలిచ్చిన మేకను కుక్కలు లాక్కెళ్లాయి.

మంత్రగాళ్లపైనే అనుమానాలు..

ఇదిలాఉండగా, ఈ క్షుద్రపూజలు మంత్రగాళ్ల పనే అని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఎవరైనా మంత్రగాళ్లను సంప్రదించి ఉండవచ్చునని, వారి ఆధ్వర్యంలోనే ఇలా క్షుద్రపూజలు చేయాలని, మేకను బలి ఇవ్వాలని ఆదేశించి ఉంటారా అని అనుమానిస్తున్నారు. నడిరోడ్డుపై ఇలా చేసిన వారు ఏ గ్రామానికి చెందిన వారు, ఎక్కడి నుంచి వచ్చారు అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇలాంటి ఘటన గ్రామంలో ఎప్పుడు జరగలేదని, నిత్యం వ్యవసాయ కూలి పనులకు ఈ మార్గంలోనే వెళ్తుంటామని, క్షుద్రపూ జలు చేయడంతో ఎలా వెళ్లేదని మహిళలు భయాందోళన వ్యక్తం చేశారు. అయితే, మంత్రగాళ్లు, క్షుద్రపూజలను ఎవరూ నమ్మవద్దని, ప్రజలు ధైర్యంగా ఉండాలని, గ్రామంలో ఎవరైనా ఇలాంటి పనులు చేసినట్లు అనుమానం వస్తే తమకు సమాచారం ఇవ్వాలని, తగిన చర్యలు తీసుకుంటామని పోలీసు లు సూచించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో కలవరం?

- కోతకు సిద్ధమవుతున్న ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లా రిజిస్ట్రేషన్ శాఖలో 20 మంది.. ముగ్గురికే అవకాశం


మహబూబ్‌నగర్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

మెట్టుగడ్డ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను తగ్గించుకునేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌శాఖలో 300పైగా ఉద్యోగులుండగా.. కేవలం 110 మందిని మాత్రమే కొనసాగించేందుకు ఆర్థికశాఖ అనుమతినిచ్చింది. మిగతా 190 మందికి ఉద్వాసన పలుకుతారా? అన్న చర్చ పొరుగు సేవల ఉద్యోగుల్లో మొదలైంది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఒక జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఉంది. అన్ని కార్యాలయాల్లో 20 మంది ఉద్యోగులు పొరుగు సేవల ప్రాతిపదికన పనిచేస్తున్నారు. వీరికి ఏటా పొడగింపునకు ప్రభుత్వం అనుమతినిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలి. ఈ శాఖలో పెరిగిన పని భారానికి అనుగుణంగా నియామకాలు లేకపోవడంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే ఆధారంగా మారారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రస్తుతం ఉన్న 20 మంది ఉద్యోగుల్లో కేవలం ముగ్గురిని మాత్రమే కొనసాగింపునకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మిగతా 17 మంది ఉద్యోగుల్లో టెన్షన్ మొదలైంది. చాలీచాలని వేతనాలతో పనిచేసే తాము రోడ్డున పడతామని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై జిల్లా రిజిస్ట్రార్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.

బాలికపై లైంగిక దాడి

- ఇన్‌స్టాగామ్‌లో పరిచయం
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

చిన్నచింతకుంట: ఇన్‌స్టాగామ్ పరిచయం ప్రేమగా మారి మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిపై పోక్సో కేసు నమోదైన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ ఓబుల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక వనపర్తి జిల్లా కేంద్రంలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. బాలికకు మూడు నెలల క్రితం సూర్యాపేట జిల్లా మట్టంపల్లి మండలం బోజతండాకు చెందిన చందర్‌నాయక్‌తో ఇన్‌స్టాగామ్‌లో పరిచయమయ్యాడు. ఈ నేపథ్యంలో చందర్‌నాయక్ సదరు బాలికను ప్రేమిస్తున్నానని వంచించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం బాలిక తల్లిదండ్రులకు తెలియడంతో వారు చిన్నచింతకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు చందర్‌నాయక్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పులుల సంరక్షణలో కలిసి పనిచేయడం కీలకం


సమావేశమైన అటవీ అధికారులు

దోమలపెంట: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని నల్లమల అడవులలో పులుల సంరక్షణలో సహకార ప్రయత్నాలను బలోపేతం చేయడం కోసం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్(ఏటీఆర్) మరియు నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎన్‌ఎస్‌టీఆర్) అంతర్రాష్ట్ర సమావేశాన్ని సోమవారం దోమలపెంటలోని అటవీ శాఖ కార్యాలయం వనమయూరిలో నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అండ్ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఏలూసింగ్ మేరు ముఖ్య అతిథిగా పాల్గొని మార్గ నిర్దేశం చేశారు. రాబోయే అఖిల భారత పులుల అంచనా కోసం వ్యూహాత్మక సన్నాహాలు చేయడం, జాతీయ సంరక్షణ ప్రణాళికకు ఇది కీలకం అని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల సహకారానికి సంబంధించి ముఖ్యమైన అంశాలపై చర్చించి తుది నిర్ణయాలను తీసుకున్నారు. అడవుల్లో వేట, అక్రమ కార్యకలాపాలను సమర్థవంతంగా అరికట్టడానికి ఏటీఆర్, ఎన్‌ఎస్‌టీఆర్ రిజర్వ్‌ల వద్ద సంయుక్త గస్తీని చేయడం కొరకు సమన్వయం పాటించాలని నిర్ణయించారు. పులుల డేటా భాగస్వామ్యం కొరకు ఖచ్చితమైన పర్యవేక్షణ, సంరక్షణ నిర్ణయాల కోసం ఫొటోగ్రాఫిక్ ఆధారాలను, కదలికల నమూనాలతో సహా పులుల డేటాను నిరంతరాయంగా ఇచ్చిపుచ్చుకోవడం కొరకు యంత్రాలను ఏర్పాటు చేసుకోవడంపై చర్చించారు. అలాగే, వన్యప్రాణుల కారిడార్ నిర్వహణ, అగ్ని నివారణ, మానవ మరియు వన్యప్రాణుల సంఘర్షణను పరిష్కరించడం వంటి వాటికి సంబంధించిన ప్రయత్నాలను సమకాలీకరంచడం కొరకు పాల్గొనే వారి నిర్దిష్ట సహకార ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. సమావేశంలో రెండు పులుల సంరక్షణ ప్రాంతాల నుంచి ఫీల్డు డైరెక్టర్లు, డిఎఫ్ఓలు, ఎఫ్‌డిఓలు, ఎఫ్ఆర్ఓలు, కీలకమైన క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

జూరాలకు భారీగా తగ్గిన వరద


నెట్టెంపాడు ఎత్తిపోతల వద్ద నీటి పంపింగ్

ధరూరు/ఆత్మకూర్/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల జలాశయానికి ఎగువ నుంచి వచ్చే వరద రోజురోజుకు భారీగా తగ్గుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో 55 వేల క్యూసెక్కులు ఉండగా.. సోమవారం రాత్రి 8 గంటలకు 43 వేల క్యూసెక్కులకు తగ్గినట్లు చెప్పారు. నెట్టెంపాడు ఎత్తిపోతలలో ఒక పంపును ప్రారంభించి నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపుతున్నట్లు వివరించారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 45,177 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 71, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 600 క్యూసెక్కుల నీటిని వినియోగించినట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.029 టీఎంసీలు ఉందన్నారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో సోమవారం ఉత్పత్తి కొనసాగిందని ఎస్‌ఈ శ్రీధర్, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఎగువ 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరిగిందన్నారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో ఇప్పటి వరకు 821.177 మి.యూ.ఉత్పత్తి సాధించామని చెప్పా రు.

శ్రీశైలంలో 884.3 అడుగుల నీటిమట్టం..

శ్రీశైలం జలాశయంలో సోమవారం 884.3 అడుగుల వద్ద 211.4759 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 45,177 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 8,958 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరిందన్నారు. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,236 క్యూసెక్కులు దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు వదులుతున్నట్లు చెప్పారు. భూగర్భ కేంద్రంలో 17.101 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 14.689 మి.యూ. విద్యుదుత్పత్తి జరిగిందన్నారు.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం పూర్తిస్థాయి నీటిమట్టం సముద్ర మట్టానికి పైన 1,021 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 1,030 క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా.. సమాంతర కాల్వలో నీటి సరఫరా లేదన్నారు. ఇదిలా ఉండగా జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 875 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 55 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు వివరించారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు జిల్లా విద్యార్థిని



కందనూలు: ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో త్వరలో నిర్వహించే 40వ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లాకు చెందిన కొడావత్ స్వప్న ఎంపికైందని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు విజేందర్ యాదవ్ సోమవారం తెలిపారు. ఇటీవల పాలమూరు యూనివర్సిటీలో జరిగిన 11వ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో విద్యార్థిని స్వప్న విశేష ప్రతిభకనబర్చడంతో జాతీయస్థాయికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడాకారులు అభినందనలు తెలియజేశారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ రెఫరీగా హైదర్ పాషా



ఎర్రవల్లి: మండల కేంద్రానికి చెందిన సయ్యద్ హైదర్ పాషా జాతీయ స్థాయి అథ్లెటిక్స్ రెఫరీగా ఎంపికయ్యారు. ఇటీవల హన్మకొండలో నిర్వహించిన టీఏ సెమినార్‌లో ఆయన పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ రెఫరీగా ఎన్నికయ్యారు. ఈ నెల 16 నుంచి 18వరకు హన్మకొండలో నిర్వహించనున్న 5వ అండర్-23 నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అథ్లెటిక్స్ త్రోస్‌కు ఆయన ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన పదో బెటాలియన్‌లోని సాయిధ చైతన్య పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు, వ్యాయామ, పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

వాలీబాల్ టోర్నీ విజేత మహబూబ్‌నగర్


మహబూబ్‌నగర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న శతాబ్ది ఉత్సవ కమిటీ


బాలికల విజేత జట్టు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎస్జీఎఫ్ అండర్ 17 ఉమ్మడి జిల్లా బాల బాలికల వాలీబాల్ టోర్నీలో మహబూబ్‌నగర్ జట్లు విజేతగా, నాగర్‌కర్నూల్ జట్లు రన్నర‌ప్‌గా నిలిచాయి. పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని వివిధ జిల్లాల క్రీడా జట్లు పాల్గొన్నాయి. విజేతలకు బాదేపల్లి ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రవిశంకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు వి.కృష్ణ , క్రీడాకమిటీ అధ్యక్షుడు కృష్ణ, ఇతర కమిటీ బాధ్యులు జ్ఞాపికలు అందజేశారు. అలాగే అన్ని జిల్లాల నుంచి చక్కటి ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ జట్టు ఈ నెల 16న జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొననుంది. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి చెన్న వీరయ్య, ఎస్జీఎఫ్ కార్యదర్శి శారదబాయి, ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, రాష్ట్ర పీడీ, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నిరంజన్, పీడీలు వడెన్న, రాంకళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పంపకాల్లో అన్నదమ్ముల మధ్య ఘర్షణ..

అడ్డొచ్చిన తల్లిని రాయితో కొట్టిన కొడుకు

అమరచింత: ఆస్తి పంపకాల్లో తనకు చెల్లించాల్సిన రూ.5లక్షలు చెల్లించకపోవడం ఏమిటంటూ అన్నదమ్ములు గొడవ పడుతుంటే వారించే ప్రయత్నం చేసిన తల్లి నాగేంద్రమ్మ తలపై రాయితో కొట్టడంతో రక్తగాయాలైన ఘటన మండలంలోని మస్తీపురం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ స్వాతి తెలిపిన వివరాల ప్రకారం.. మస్తీపురం గ్రామానికి చెందిన దోసు నాగేంద్రమ్మకు ఇద్దరు కుమారులు. వారికి పొలంతో పాటు ఇంటిని సమానంగా పంచిపెట్టింది. అయితే నాగేంద్రమ్మ ఇంటిని సమ భాగాలుగా చేస్తే రూ.5లక్షలు పెద్దకుమారుడైన కృష్ణకు చిన్నకుమారుడు మోహన్ చెల్లించాలని పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారని తెలిపారు. రూ.5లక్షలు ఇవ్వడంలో ఆలస్యం చేస్తున్నావంటూ కృష్ణ తన తమ్ముడైన మోహన్ ఇంటికి ఆదివారం రాత్రి గొడ్డలితో దాడి చేయడానికి యత్నించగా చుట్టు పక్కల వారు గొడవలను శాంతింప చేశారు. తనకు న్యాయం చేయమని చెప్పిన తన తల్లి చిన్న కొడుకుకే మద్దతు ఇస్తుందనే కసితో సోమవారం నాగేంద్రమ్మ తన చిన్నకొడుకు మోహన్ పిల్లలను స్కూల్ బస్ ఎక్కించడానికి బస్టాండ్‌కు రాగా. అక్కడే ఉన్న కృష్ణ ఆయన భార్య, నాగేంద్రమ్మతో గొడవపడ్డారు. తల్లిపై కోపంతో ఉన్న కృష్ణ రాయితో తలపై కొట్టగా తీవ్ర రక్త గాయాలయ్యాయి. బాధితురాలు నాగేంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

తండ్రిపై కొడుకు దాడి: కేసు నమోదు

లింగాల: మండలంలోని పద్మన్నపల్లికి చెందిన అంగోతు తౌర్యపై కుమారుడు అంగోతు విజయ్ దాడి చేసిన సంఘటనకు సంబంధించి సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడు తెలిపారు. కుమారుడు జులాయిగా తిరుగుతూ తరచుగా డబ్బులు కావాలని తల్లిదండ్రులను వేధించేవాడు. ఆదివారం రాత్రి డబ్బుల గురించి తండ్రిపై గొడవపడి దాడికి పాల్పడ్డాడు. తౌర్య తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు విజయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూఢనమ్మకాల పేరుతో మోసం: నలుగురు అరెస్ట్

మదనాపురం: మూఢనమ్మకాల పేరుతో మదనాపూర్ మండలానికి చెందిన ఓ వ్యక్తిని మోసం చేసిన ఘటన సోమవారం వెలుగుచూసింది. సోషల్ మీడియా ద్వారా పరిచయమైన ఓ వ్యక్తి జ్యోతిష్యం చెప్తాననే ప్రకటన ద్వారా బాధితుడిని నమ్మించి, దుష్టశక్తులు ఉన్నాయంటూ అష్టదిగ్బంధన పూజలు చేయాల్సిన అవసరం ఉందని నమ్మబలికాడు. మొత్తం రూ.5.66 లక్షలు వసూలు చేశాడు. మోసానికి పాల్పడిన ప్రధాన నిందితుడు ఊరగోపి పల్నాడు జిల్లా బెల్లంకొండకు చెందినవాడిగా గుర్తించారు. అతనితోపాటు ఖమ్మం జిల్లాకు చెందిన సిరిగిరి బాబు, పస్తం రాజు, వరంగల్‌కు చెందిన అల్లం గోపి కలిసి హైదరాబాద్‌లో నివాసముంటూ మోసానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. సోషల్ మీడియా ద్వారా పూజలు చేస్తామని చెప్పి మోసం చేసే వ్యక్తులపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.



కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

కోస్గి రూరల్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్న సంఘటన గుండుమాల్ మండలంలోని హన్మాన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబీకుల కథనం మేరకు.. హన్మాన్‌పల్లి గ్రామానికి చెందిన ఎర్ర భరత్(49) తరచుగా కుటుంబ విషయంలో గొడవలు జరుగుతుండేవి. ఆదివారం మరో మారు గొడవలు జరగడంతో మనస్తాపానికి గురైన భరత్ ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రైవేట్ వాహనంలో కోస్గి ఆస్పత్రికి, అక్కడి నుంచి ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనపై భరత్ భార్య సత్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

వ్యక్తి మృతిపై పోలీసుల విచారణ

నాగర్‌కర్నూల్ క్రైం: గుడిపల్లి శివారులో ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన శ్రీపురం గ్రామానికి చెందిన మైనగాని రాములు కేసుకు సంబంధించి పోలీసుల విచారణ కొనసాగుతుంది. మృతుడి భార్యతో పాటు పెద్దముద్దునూరుకు చెందిన ఓ వ్యక్తిపై అనుమానం ఉందని పోలీసులకు మృతుడి తండ్రి ఫిర్యాదు చేయడంతో విచారణ ముమ్మరం చేశారు. మైనగాని రాములును హత్య చేసి మోటారు సైకిల్ పైనుంచి కింద పడి మృతిచెందినట్లుగా నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారని కుటుంబ సభ్యులు ఆరోపణలు చేయడంతో పోలీసులు విచారణను వేగవంతం చేసినట్లు తెలిసింది. మొదట అనుమానాస్పద మృతిగా నమోదు చేసిన కేసును పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాత హత్యకేసుగా మార్చే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. కేసుకు సంబంధించి సీఐ అశోక్‌రెడ్డిని వివరణ కోరగా విచారణ కొనసాగుతుందని త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

పుస్తెల తాడు ఎత్తుకెళ్లిన ఆగంతకుడు

తిమ్మాజిపేట: మహిళ మెడనుంచి గుర్తుతెలియని వ్యక్తి మూడు తులాల బంగారు పుస్తెతాడు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని మారేపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మంగళి మణెమ్మ తన మనువరాలిని తీసుకొని మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి ఇంటి వద్దకు వచ్చింది. బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆవిడ వద్దకు వచ్చి తిమ్మాజిపేటకు దారి ఎటు అంటూ మాటలు కలిపాడు. దారి చెబుతూ మాజీ సర్పంచ్ ఇంటి గేటు తీస్తుండగా ఆగంతకుడు మహిళ మెడలో ఉన్న మూడు తులాల పుస్తెల తాడు తెంచుకొనిపరుగెత్తి స్టాటింగ్‌లో ఉన్న బైక్‌పై వెళ్లి పారిపోయాడు. లబోదిబోమంటూ బాధిత మహిళ ఏడుస్తుండడంతో చట్టుపక్కల వారు వచ్చి వెదికిన ఆచూకీ దొరకలేదు. గుర్తు తెలియని వ్యక్తి పుస్తెలతాడు ఎత్తుకెళ్లాడనే విషయం తెలుసుకున్న తిమ్మాజి పేట ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి గ్రా మానికి వెళ్లి చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించా రు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.